# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 12-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఆయుష్మాన్‌భారత్ కింద ఉచిత వార్షిక ఆరోగ్య బీమా అందించేందుకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
2. **ఆంధ్రప్రదేశ్ లోని బాపట్ల జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు.**
3. **భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రత్యేక యాప్ రూపొందించామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**
4. **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీలో పర్యటిస్తున్నారు.**
5. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టంపై రూపొందించిన ప్రాథమిక నివేదికను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కేంద్ర హోం మంత్రి అమీత్ షాకు అందజేశారు.**

==========================

దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఆయుష్మాన్‌భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద 5 లక్షల రూపాయల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా అందించేందుకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశ నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. ఆయుష్మాన్‌భారత్ ద్వారా ఆరోగ్య బీమా కల్పించేందుకు 3 వేల 437 కోట్ల రూపాయలతో అమలుచేసే ఈ పథకం వల్ల దాదాపు ఆరు కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (39 సెకన్లు)

అలాగే పలు పథకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లో 62 వేల 5 వందల కిలోమీటర్ల రహదారులు నిర్మించనున్నామని తెలిపారు. పీఎం-ఈ డ్రైవ్ పథకం కింద విద్యుత్తు వాహనాలు, ఛార్జింగ్ స్టేషన్లకు, పీఎం ఈ-బస్ కింద నగరాల్లో తిరిగే విద్యుత్తు బస్సులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కేంద్ర మంత్రివర్గం తీర్మానించిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని లంకా, తీర గ్రామాలలో ముఖ్యమంత్రి పర్యటించి పంట నష్టం, దెబ్బతిన్న గృహాలు, రహదారులను పరిశీలించనున్నారు. అనంతరం వరద బాధితులతో ముఖ్యమంత్రి మాట్లాడతారని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రత్యేక యాప్ రూపొందించామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కు.అచ్చెన్నాయుడు తెలిపారు. నిన్న అమరావతిలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వరి రైతులకు ఎకరాకు 10 వేల రూపాయల చొప్పున సాయం అందించాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంతో రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతుకు జరిగిన నష్టాన్ని యాప్‌లో నమోదు చేసి సామాజిక తనిఖీ నిర్వహించిన తర్వాత పెట్టుబడి సాయం చెల్లిస్తామని తెలిపారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు 390 కోట్ల రూపాయల పెట్టుబడి రాయితీ చెల్లించాలని అంచనాలు రూపొందించామని అధికారులు మంత్రికి వివరించారు.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో సమావేశం కానున్నారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ముఖ్యమంత్రి మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్య వర్గం ఏర్పాటు వంటి అంశాలపై చర్చించనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

వరద సహాయక చర్యలు చేపట్టడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. నిన్న గుంటూరు కారాగారంలో ఉన్న మాజీ పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్‌తో ములాఖాత్ ద్వారా మాట్లాడారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ, వాతావరణ హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని, బుడమేరు గేట్లు ఎత్తి విజయవాడ వరదలకు కారణమైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు.

---------------------------

బుడమేరుకు ఆధునీకరణ పనులు చేపట్టకపోవడంతోనే గండ్లు పడి విజయవాడకు వరదలు వచ్చాయని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలో నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, బుడమేరు నీటి మళ్లింపు పనులను గత ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. పనులను పూర్తి చేసి ఉంటే గండ్లు పడేవికావని చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ కి పడవలు కొట్టుకొచ్చిన ఘటనపై ప్రభుత్వం విచారణ జరుపుతుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టంపై రూపొందించిన ప్రాథమిక నివేదికను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్ర హోం మంత్రి అమీత్ షాకు అందజేశారు. తెలుగురాష్ట్రాల్లో కేంద్రమంత్రి పర్యటించి వరద నష్టంపై ప్రాథమిక నివేదికను

రూపొందించారు. నిన్న ఢిల్లీలో అమిత్ షాని కలిసి నివేదికను అందజేశామని ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. నివేదికలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించనున్నామని ఆయన పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో జరుగుతున్న 2వ ఆసియా-పసిఫిక్ మంత్రివర్గ సమావేశంలో సభ్య దేశాల ఛైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ చైర్మన్ గా రామ్మోహన్ నాయుడు ను సింగపూర్ దేశం ప్రతిపాదించగా ఆయా దేశాల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. దేశం తరపున దక్కిన గౌరవాన్ని బాధ్యతగా స్వీకరిస్తానని తెలిపారు. విమానయాన రంగాన్ని ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు సభ్య దేశాల మధ్య రవాణాను సులభతరం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు.

---------------------------

తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉద్ధృతి పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నిన్న భద్రాచలంలో పర్యటించిన మంత్రి కరకట్ట వద్ద వరద ఉద్ధృతి, నూతన కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గోదావరికి వరద ప్రవాహం పెరుగుతున్నందున లోతట్టు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి ప్రవాహం 50 అడుగులు దాటి ప్రవహిస్తున్నందున్న వరద ఉద్ధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు మంత్రి సూచించారు.

---------------------------

హైదరాబాద్‌లో ఇప్పటి వరకు వంద ఎకరాలకుపైగా అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ-హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతల వివరాలను ఆయన నిన్న పాత్రికేయులకు వివరించారు.. జూన్ 27 నుంచి హైదరాబాద్ మహానగర పాలక సంస్థ – జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, మాదాపూర్ సున్నం చెరువులో 42, దుండిగల్ కత్వా చెరువు పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను తొలగించామన్నారు. అత్యధికంగా అమీన్‌పూర్‌లో 51 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రంగనాథ్ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం విధానాన్ని అమలు చేయనున్నామని రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నూతన మద్యం పాలసీ రూపకల్పనపై మంత్రి వర్గ ఉపసంఘం నిన్న అమరావతిలో సమావేశమైంది. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఆరు రాష్ట్రాల్లోని మద్యం విధానాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన మద్యం పాలసీని తీసుకొస్తామని తెలిపారు. గత ప్రభుత్వ విధానాలు, నాసిరకం మద్యం కారణంగా రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని మంత్రి విమర్శించారు.

====================